# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పని చేయడంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.
- ❖ కార్మికులు భద్రంగా ఉంటేనే రాష్ట్రం భద్రంగా ఉంటుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు.
- ❖ రాష్ట్రంలో ప్రధాన నగరాలకు విద్యుత్ బస్సులు రానున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.
- ❖ నెల్లూరు జిల్లాలో ఒకే రోజు 105 అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

==============================

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పని చేయడంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఈరోజు పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో 700 మంది డిఎస్సీ అభ్యర్థులకు 8 లక్షల రూపాయల విలువ గల ఉచిత స్టడీ మెటీరియల్ ను కేంద్ర సహాయ మంత్రి అందజేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వాలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. అత్యధిక ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ఘనత ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుకే దక్కుతుందని చెప్పారు.

==============================

కార్మికులకు భద్రతపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఈరోజు అనకాపల్లిలో 54వ జాతీయ భద్రతా వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు భద్రంగా ఉంటేనే రాష్ట్రం భద్రంగా ఉంటుందని అన్నారు. కార్మికుల కోసం యాజమాన్యాలు మరింత శ్రద్ధ వహించాలని చెప్పారు. ప్రధానంగా రసాయన పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు మరింత అగాహన, అప్రమత్తత కల్పించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం, నిప్పును పసిగట్టే అలారం వంటివి తప్పని సరిగా

వినియోగించాలని అన్నారు. యాజమాన్యాలు, ప్రభుత్వ యంత్రాంగం సమిష్టిగా పనిచేస్తూ.. పని ప్రదేశాలను తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, పలువురు శాసనసభ్యులు పాల్గొన్నారు.

==============================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధికి కృషి చేస్తున్నామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి  అన్నారు. ఈరోజు ఆయన నియోజకవర్గంలో 191 కోట్ల రూపాయలతో 105 అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... 60 రోజుల్లో ఈ పనులు పూర్తి చేస్తామని తెలియజేస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

కాగా నెల్లూరు జిల్లాలో ఒకే రోజు 105 అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం దేశ, రాష్ట్ర చరిత్రలో అరుదైన ఘట్టమని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమ వేదికగా పేర్కొన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అభివృద్ధికి అత్యంత ప్రధాన్యత ఇస్తోందని మంత్రి లోకేష్ అన్నారు.

==============================

రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఈరోజు విశాఖపట్నంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల  అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గతంలో సాధికారత కోసం మహిళలు అనేక పోరాటు చేశారని అన్నారు. ప్రభుత్వాలు మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. ఆడపిల్లలతో పాటు మగ పిలలను కూడా భద్రతగా, భాధ్యతతో పెంచాలని సూచించారు. తమ వృత్తుల్లో మహిళలు ధైర్యంగా ఉండాలన్నారు. నర్సుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఎన్టీఆర్ వైద్య సేవా చైర్మన్ సీతం రాజు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

==============================

ఒంటిమిట్టలో శ్రీరామచంద్రుని బ్రహ్మోత్సవాలను  ఏప్రిల్ 5 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు.  ఈరోజు ఆయన కడప జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో నిర్వహించిన మహాసంప్రోక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా బ్రహ్మోత్సవాల గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం, ఏప్రిల్ 11న సీతారాముల కళ్యాణం జరగనున్న వేదికను పరిశీలించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. కాగా రాముల వారికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు.

విరామం

==============================

కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రధాన నగరాలకు విద్యుత్ బస్సులను అందించే అవకాశం ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.  ఈరోజ ఆయన గుంటూరు బస్టాండ్ ను సందర్శించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. పీపీపీ విధానంలో 100 బస్సులను గుంటూరుకు తీసుకువచ్చే అవకాశం ఉందని చెప్పారు. విద్యుత్ బస్సుల నిర్వహణకు 5 ఎకరాల స్థలంలో ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

ఈ బస్టాండ్ లో ఉన్న 10 ఎకరాల భూమిని ఏ విధంగా అభివృద్ధి చేయాలనే అంశంపై ఆలోచన చేస్తున్నామని చెప్పారు. త్వరలో ఆధునికీకరించి మెరుగైన వసతులను అందుబాటులోకి తీసుకువస్తామని కేంద్రసహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

==============================

గ్రామీణ ప్రాంతాలకు సైతం విద్య చేరువయ్యేందుకు ప్రభుత్వ కళాశాలలు ఎంతో అవసరమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఈరోజు బాపట్ల జిల్లా రేపల్లెలో ప్రభుత్వ నూతన పాలిటెక్నిక్ కళాశాల భవనాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ పాలిటెక్నిక్ కళాశాలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని, సీఎస్ఆర్ నిధులతో కళాశాలను మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం పుస్తకాలు, దుస్తులు, షూస్, బ్యాగులు అన్నీ ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు.

==============================

ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. నెల్లూరులో ఈరోజు ఆత్మకూరు నియోజకవర్గంలోని 27 మంది పేద లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 15వ ఆర్థిక సంఘ నిధులను నేరుగా పంచాయతీలకు ప్రభుత్వం అందిస్తోందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి “తల్లికి వందనం” పథకం కింద బడికెళ్లే ప్రతి విద్యార్థికి 15వేల రూపాయల చొప్పున కుటుంబంలోని అందరు బిడ్డలకు అందిస్తామన్నారు. రైతులకు “అన్నదాత సుఖీభవ” పేరుతో 20 వేల రూపాయలను మూడు విడతలుగా అందిస్తామన్నారు.

==============================

మహిళల ఆర్థిక వృద్ధితో సమజ అభివృద్ధి సాధ్యపడుతుందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణమండపంలో ఈరోజు నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు.

==============================
==============================